సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



సేవాలాల్ జయంతి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

- 9లో ▸



ఘనంగా పెద్దమ్మ పండుగ

జిల్లాలోని పలు గ్రామాల్లో పెద్దమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /17.1

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవు. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశం ఉంది.

ఎంపీ టిక్కెట్ రేసులో..

- పోటాపోటీగా కటౌట్లు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు
- ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్న నేతల హడావుడి
- ప్రధాన పార్టీల్లో ఆశావహుల సందడి



కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటాపోటీగా ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఉబలాటపడుతున్న వాళ్లు చేస్తున్న హడావుడి ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది. ప్రధాన పార్టీల నుంచి టిక్కెట్ ఆశిస్తున్న వారు నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, హోర్డింగులు, కటౌట్లు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీలు అభ్యర్థిత్వాలపై కసరత్తు చేస్తుండగా, ఆశావహులు మాత్రం హడావుడి చేస్తున్నారు. టిక్కెట్ రేసులో ఎక్కడా వెనకబడొద్దనే ఉద్దేశంతో పోటాపోటీ కార్యక్రమాలు చేపడుతున్నారు. కొందరు హోర్డింగులు ఏర్పాటు చేస్తుండగా, మరికొందరు కటౌట్లు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి టిక్కెట్లు ఆశిస్తున్నవారే ఎక్కువ హడావుడి చేస్తున్నట్లు కనబడుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్‌లో కొంత స్తబ్దత నెలకొంది. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు టిక్కెట్ ఇస్తారని ఒక ప్రచారం, అభ్యర్థిని మారుస్తారనే మరో ప్రచారం జరుగుతోంది. అయితే ఆ పార్టీ నేతలెవరూ టిక్కెట్ రేసులో ఉన్నట్లుగా హడావుడి చేయడం లేదు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో టిక్కెట్ ఆశించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా..

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా ప్రధాన పార్టీల నేతలు ఫ్లెక్సీలు, హోర్డింగులు, వాల్‌పోస్టర్లు వేయిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, పట్టణాలు, మండల కేంద్రాల్లో పెద్దఎత్తున పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. అప్పుడే ఎన్నికలు వచ్చాయేమోననే విధంగా ప్రచారం జరుగుతోంది. క్రికెట్ పోటీలు, విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ వంటివి నిర్వహిస్తున్నారు. టిక్కెట్ ఆశిస్తున్నారని ప్రజలు అర్థం చేసుకునేలా వారి ప్రయత్నాలు కనబడుతున్నాయి. టిక్కెట్ ఎవరిని వరిస్తుందో కానీ ప్రచారానికి పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో షెట్కార్, ఉజ్వల్‌రెడ్డి..

రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం కనబడుతోంది. పార్టీ టిక్కెట్ కోసం మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారు. అయితే ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి కూడా టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకుని, ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉజ్వల్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ముఖ్య నేతల ఫొటోలతో రూపొందించిన ఫ్లెక్సీలు అంతటా ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల్లో తన ఫొటోతో పాటు తన కూతురి ఫొటో కూడా పెట్టడంతో టిక్కెట్ తనకు కాకుంటే తన కూతురికి ఇవ్వాలని కోరుతున్నట్లు భావిస్తున్నారు. ఇద్దరు నేతలు టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సురేష్ షెట్కార్‌కు మొన్నటి ఎన్నికల్లో నారాయణఖేడ్ అసెంబ్లీ టిక్కెట్ వచ్చినట్లే వచ్చి చేజారింది. ఈ నేపథ్యంలో ఎంపీ టిక్కెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. అయితే ఉజ్వల్‌రెడ్డి కూడా టిక్కెట్ కోసం సీరియస్‌గా ప్రయత్నిస్తుండడంతో ఇద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది.

బీజేపీలో హోరాహోరీ

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ టిక్కెట్ కోసం బోలెడు మంది వరుసలో ఉన్నారు. డాక్టర్ పైడి ఎల్లారెడ్డి, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, ఎం.జైపాల్‌రెడ్డి, ఆలె భాస్కర్, ఆకుల విజయ, సురేశ్‌రెడ్డి తదితరులు టిక్కెట్ ఆశిస్తున్నారు. టిక్కెట్ ఆశిస్తున్న వారు పెద్దఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగులు, పోస్టర్లు వేయిస్తున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. టిక్కెట్ రేసులో ఉన్న పైడి ఎల్లారెడ్డి అయోధ్య ప్రసాదం తయారు చేయించి ఊరూరికి పంపిస్తున్నారు. సుభాష్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ రూపొందించిన వీడియోలను ప్రత్యేక స్క్రీన్లపై ప్రదర్శిస్తున్నారు. సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.

పారదర్శకంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎస్‌ఎఫ్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల అధికారులకు గురువారం జాతీయస్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న అధికారులకు ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం కామారెడ్డి కలెక్టర్ పాటిల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమంగా మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ జరిగినప్పుడు ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలకు సమాచారం వచ్చిన వెంటనే వెళ్లి పట్టుకోవాలన్నారు. ఎన్నికల్లో రూ. 50 వేలకు మించి ఆధారాలు లేని డబ్బులను సీజ్ చేయాలన్నారు. రూ.10 లక్షలకు మించి డబ్బులు దొరికినట్లయితే ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించాలన్నారు. వీసీలో కామారెడ్డి ఆర్డీవో రఘునాథరావు, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్ పాల్గొన్నారు.

టార్గెట్ పూర్తి చేయండి

కామారెడ్డి క్రైం: జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం టార్గెట్ ఈనెల 29 లోగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. రోజూ వారి టార్గెట్ నిర్దేశించుకుని వందశాతం పూర్తయ్యేలా పని చేయాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లక్ష్యాలు పూర్తి చేయని మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఉప తహసీల్దార్లు ప్రతినిత్యం రైస్ మిల్లులను పరిశీలించి రైస్ మిల్ పేరు, మిల్లింగ్ చేసిన వివరాలు తమకు వాట్సాప్ ద్వారా తెలియపర్చాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, ఏఎస్‌వో నిత్యానంద్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన జెడ్పీ సీఈవో

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన చందర్‌నాయక్ గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి జెడ్పీ సీఈవోగా పనిచేసిన డి.సాయాగౌడ్ నిజామాబాద్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. నిజామాబాద్ డీఆర్‌డీవోగా పనిచేస్తున్న చందర్‌నాయక్ కామారెడ్డికి బదిలీపై వచ్చారు. ఈ ఇద్దరు అధికారులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వారే కావడం గమనార్హం.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ సీఈవో చందర్‌నాయక్

న్యూస్‌రీల్

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- కామారెడ్డి బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణాభివృద్ధికి ప్రజలు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరూ సహకరించాలని కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ కోడారు సుజాత కోరారు. బదిలీపై కామారెడ్డికి వచ్చిన ఆమె గురువారం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ బకాయిల పన్నులను సకాలంలో చెల్లించి బల్దియా ఆదాయానికి, అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కామారెడ్డి డీఎస్పీగా నాగేశ్వర్ రావు

- డాక్టర్ డి.రాజేశ్వర్ పోస్టింగ్ రద్దు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఎస్పీ బదిలీలో మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖ చేపట్టిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా కామారెడ్డి డీఎస్పీగా ఉన్న ఆర్.ప్రకాశ్ మంచిర్యాల ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొదట రాష్ట్ర పోలీసు శాఖ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో పని చేస్తున్న డాక్టర్ డి.రాజేశ్వర్‌ను నియమిస్తూ బదిలీ ఉత్తర్వులు బుధవారం సాయంత్రం జారీ అయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా డాక్టర్ రాజేశ్వర్ పోస్టింగ్‌ను శుక్రవారం రద్దు చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని వెస్ట్ జోన్ ఏసీపీగా ఉన్న డి.నాగేశ్వర్ రావును నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. డాక్టర్ రాజేశ్వర్ కామారెడ్డి ప్రాంతానికి చెందిన వారే అని సమాచారం. స్థానికత కారణంగా ఆయన పోస్టింగ్ రద్దయిందని భావిస్తున్నారు.

కేంద్ర హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి(కేవీఆర్) గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయించాలని విన్నవించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించడంతో కేవీఆర్‌ను కేంద్ర మంత్రి అభినందించారు.

దుప్పిని రక్షించిన గ్రామస్తులు



కామారెడ్డి క్రైం: కుక్కలు దాడి చేసేందుకు యత్నించిన ఓ దుప్పిని గ్రామస్తులు రక్షించి అటవీ అధికారులకు అప్పగించారు. ఈ ఘటన కామారెడ్డి మండలం సరంపల్లి శివారులోని పంట పొలాల్లో గురువారం జరిగింది. శానబోయిన రాజశేఖర్, మామిడ్ల అరవింద్, పోలు ప్రసాద్‌లు పొలం పనులు చేసుకుంటుండగా అటుగా వచ్చిన ఓ చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయబోయాయి. వెంటనే వారు దుప్పిని పట్టుకుని రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. రేంజ్ అధికారి రమేశ్, సిబ్బంది అక్కడికి చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సమీపంలోని ఆర్గొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అటవీ జంతువును కాపాడిన గ్రామస్తులను ఎఫ్ఆర్‌ఓ అభినందించారు.

18న గురుకులాల సీవోఈ పరీక్ష

ఇందల్వాయి: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ప్రతిభ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 18న ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత



ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

- ఎస్పీ సింధు శర్మ
- సమీకృత పోలీసు చెక్‌పోస్టు ప్రారంభం

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ సింధు శర్మ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ వద్ద ఆధునీకరించిన సమీకృత పోలీసు చెక్‌పోస్టును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2013లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ నుంచి అనుమతులు తీసుకుని చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంతో అన్ని వసతులతో భవనాన్ని ఆధునీకరించి పునఃప్రారంభించినట్లు తెలిపారు. ఇందులోనే కామారెడ్డి రూరల్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఉన్న జాతీయ రహదారుల వెంబడి జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, అవసరమైన జాగ్రత చర్యలు చేపట్టడానికి చెక్‌పోస్టు ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ నుంచే హైవే పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తారని వెల్లడించారు. అనంతరం చెక్‌పోస్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ట్రైయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, డీఎస్పీలు ఆర్.ప్రకాశ్, శ్రీనివాసులు, సీఐలు రామన్, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ కుమార్, సంపత్, జార్జ్, తిరుపయ్య, సుభాష్, శేఖర్, కృష్ణ, ఎస్సైలు రాజు, కొండ విజయ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నాగమడుగును త్వరగా పూర్తిచేయాలి

- లెండి, కౌలాస్ ప్రాజెక్టులకు నిధులివ్వండి
- ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులను భర్తీచేయాలి
- అసెంబ్లీ సమావేశాల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్(జుక్కల్): మంజీర నదిపై నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం నియోజకవర్గంలోని పలు సమస్యలపై సభ దృష్టికి తీసుకువచ్చారు. జుక్కల్‌లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అలాగే అభివృద్ధిలో కూడా వెనుకబాటుకు గురయ్యిందన్నారు. గత ప్రభుత్వం నాగమడుగు లిఫ్ట్ పనులు చేపట్టినా.. పనులు నత్తనడకన సాగుతున్నాయని వివరించారు. పనులు త్వరితగతిన పూర్తి చేస్తే 41వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. అలాగే అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు పనులను 2003లో ప్రారంభించగా పనులు మధ్యలోనే ఉన్నాయన్నారు. రూ. 573 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం తమ వంతుగా రూ. 223 కోట్లు మంజూరు చేసిందన్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేస్తే 25వేల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు జుక్కల్ నియోజకవర్గంలో ఉన్నా కేవలం 4,500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని వివరించారు. కౌలాస్ ప్రాజెక్టు పూడికతీతకు నిధులు ఇవ్వాలని సభలో కోరారు. అలాగే నాందేడ్-సంగారెడ్డి జాతీయ రహదారి మార్గంలో 150 కిలోమీటర్ల మేర ట్రామాకేర్ సెంటర్ లేదని, వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. బిచ్కుందలో వంద పడకల ఆస్పత్రి ఉన్నా వైద్యులు లేరన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 18 మంది వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యత దిశగా..

గ్రామాల్లో సీఎఫ్ఎల్ కేంద్రాలు

- బ్యాంకింగ్ వ్యవహారాలపై ప్రజలకు అవగాహన
- 22 మండలాలకు ఆరు కేంద్రాల ఏర్పాటు
- జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం



సదాశివనగర్‌లో సీఎఫ్ఎల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

కామారెడ్డి క్రైం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ, లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. కేంద్రాలు రిజర్వ్ బ్యాంక్ ఆధీనంలో పని చేస్తుండగా కెనరా(జిల్లా లీడ్) బ్యాంక్ పర్యవేక్షిస్తుంది. నాలుగైదు మండలాలకు ఒక కేంద్రం చొప్పున మొత్తం జిల్లాలో 6 చోట్ల ఈ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. వాటిలో ఇప్పటికే నాలుగు ప్రారంభం కాగా, బాన్సువాడ, బిచ్కుందలలో ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బ్యాంకు వ్యవహారాలపై ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

జిల్లాలో ఆరు కేంద్రాలు..

జిల్లాలోని 22 పాత మండలాలకు గాను ఆరు చోట్ల సీఎఫ్ఎల్(సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరేచరీ) కేంద్రాలు ఏర్పాటు చేశారు. కామారెడ్డి, రాజంపేట, తాడ్వాయి మండలాలకు జిల్లా కేంద్రంలో, మాచారెడ్డి, దోమకొండ, రామారెడ్డి మండలాలకు మాచారెడ్డిలో, ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్‌లకు ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఇదివరకే ప్రారంభమయ్యాయి. సదాశివనగర్, గాంధారి, భిక్కనూరు, బీబీపేట్‌లకు సదాశివనగర్‌లో, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, నిజాంసాగర్‌లకు బాన్సువాడలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఈనెల 14న ప్రారంభించారు. బిచ్కుంద, మద్నూర్, పిట్లం, జుక్కల్, పెద్ద కొడప్‌గల్ మండలాలకు గాను బిచ్కుందలో సీఎఫ్ఎల్ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాలు తమ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు

సీఎఫ్ఎల్ కేంద్రాల్లో బ్యాంక్ అంటే ఏమిటి, ఖాతా ఎలా తెరవాలి, లావాదేవీలు ఎలా ఉంటాయి, బ్యాంకుల ద్వారా ఉపయోగాలు ఏమిటి, ఎలా సద్వినియోగం చేసుకోవాలి, వడ్డీ వ్యాపారుల నుండి ఎలా సంరక్షింపబడాలి, రుణ సౌకర్యాలు, బీమా పాలసీలు, పెన్షన్ పథకాలు, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్, వినియోగదారుల రక్షణ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరిస్తారు. ఇందు కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, జీపీలు, ఐకేపీ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా ఈనెల 26 నుంచి వచ్చే నెల 1 వరకు 'సరిగ్గా ప్రారంభించండి – ఉత్తేజితులు కండి' అనే నినాదంతో సీఎఫ్ఎల్ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపెయిన్ జరుగనుంది. గ్రామాల్లో సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నారు.

అవగాహన పెంచడానికే..



బ్యాంకింగ్ సేవలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు సీఎఫ్ఎల్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రజలు వడ్డీ వ్యా పారుల బారిన పడొద్దు. అవగాహన పెంచుకుని బ్యాంకుల ద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– భార్గవ సుధీర్, లీడ్ జిల్లా మేనేజర్, కామారెడ్డి

నిజామాబాద్‌కు మరో రెండు కోర్టులు

ఖలీల్‌వాడి: జిల్లాలో అదనంగా రెండు కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి ఇచ్చినట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. మొదటి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కం ఐదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్టులను శనివారం హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ తుకారాంజీ ప్రారంభిస్తారని తెలిపారు.

స్వయం ప్రతిపత్తి ఉత్తర్వులు అందజేత

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరామ్ నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంజూరైన స్వయం ప్రతిపత్తి ఉత్తర్వులను ప్రిన్సిపాల్ గంగాధర్‌కు గురువారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అందజేశారు. దీంతో కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. గతేడాది నవంబర్‌లో న్యాక్ గుర్తింపు కోసం వర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సభ్యులు కళాశాలను సందర్శించారు. విద్యాభివృద్ధి, వసతులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలతో పాటు అన్ని కోణాల్లో గమనించిన అధికారులు కళాశాలకు అటానమస్(స్వయంప్రతిపత్తి) మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం అందుకున్నారు. అటానమస్ గుర్తింపుతో స్థానిక తెలంగాణ విద్యార్థులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర విద్యార్థులకు విద్యాభ్యాసానికి మేలు జరుగుతుందన్నారు.



స్వయం ప్రతిపత్తి ఆర్డర్‌కాపీ అందుకుంటున్న ప్రిన్సిపాల్ గంగాధర్

నిరుపయోగంగా ఆరోగ్య స్వస్థత కేంద్రం

- యోగా గురువును నియమించాలని కోరుతున్న గర్భిణులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరగాలనే కృతనిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించింది. అయితే, యోగా గురువులు లేకపోవడంతో కేంద్రాలు వృథాగా ఉంటున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నేషనల్ ఆయుష్ మిషన్ నిధులతో నిర్మించిన ఆరోగ్యస్వస్థత కేంద్రం ఆరు నెలలుగా ఉపయోగంలోకి రాలేదు. శ్వాస సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ఓపీ పేషెంట్లు, సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులతో యోగాసాధన చేయించడానికి ఏర్పాటు చేసిన కేంద్రంలో యోగా గురువు, సిబ్బందిని నియమించలేదు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని సాధించడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు వృథాగా ఉన్నాయి. అధికారులు స్పందించి యోగా గురువును నియమిస్తే ఆరోగ్యస్వస్థత కేంద్రం ఉపయోగంలోకి వస్తుందని స్థానికులు అంటున్నారు.


ఎల్లారెడ్డిలో నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రం

గర్భిణులకు ఉపయోగకరం

గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరగాలనే ఉద్దేశంతో ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఏర్పాటు చేశారు. వినియోగంలోకి వస్తే గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి.

– లక్ష్మి, గర్భిణి, ఎల్లారెడ్డి

యోగా గురువును నియమించాలి

ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా గురువులను నియమిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. యోగా చేయడం ద్వారా మానసిన ప్రశాంతత కలుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని యోగా కేంద్రాల్లో సిబ్బందిని నియమించాలి.

– సాయిబాబా, ఎల్లారెడ్డి

అధికారులకు నివేదించాం

సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య స్వస్థత కేంద్రం నిరుపయోగంగా ఉంటోంది. యోగా సిబ్బందిని నియమించాలని అధికారులకు నివేదించాం.

– డాక్టర్ రవీంద్రమోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎల్లారెడ్డి

కేజీబీవీలో విద్యార్థులతో వంట

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

దోమకొండ: మండలంలోని సీతారాంపల్లి కేజీబీవీలో విద్యార్థులతో రెండు రోజులక్రితం వంట పనులు చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వంట మనుషులు ఉన్నా విద్యార్థినులతో పిండి కలిపి చపాతీలు, అల్పాహారం తయారు చేయించి వారితోనే వడ్డించిన వీడియోలు బయటికి వచ్చాయి. పీఈటీ వీణ తనను ప్రిన్సిపల్ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ వారంరోజుల క్రితం మైండ్ స్ట్రోక్‌తో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే.

విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఈ సందర్భంగా పీఈటీ ఆరోపించారు. ఆ తరువాత పీఈటీ తీరు సరిగా లేదని ప్రిన్సిపల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా రెండు రోజుల నుంచి పాఠశాలలో విద్యార్థినులు వంటలు చేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు పాఠశాలకు వెళ్లి విద్యార్థినులు వంటలు చేస్తున్న ఫొటోలు, వీడియోలు తీశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను ఏబీవీపీ నాయకులు కోరనున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ప్రిన్సిపల్ మమతను సంప్రదించడానికి ప్రయత్నించగా, తాను ఆస్పత్రిలో ఉన్నానని బదులిచ్చారు.



రామేశ్వర్‌పల్లిని సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖ అధికారులు గురువారం సందర్శించారు. 'రామేశ్వర్‌పల్లిలో నీటి ఎద్దడి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజినీర్ రమేశ్, మండల పరిషత్ అధికారి ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నీటి సమస్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొందరు మంచినీటి కుళాయిలకు కరెంట్ మోటార్లు పెడుతున్నారని, దీనివల్ల కొందరి ఇండ్లకు నీరు తక్కువగా వస్తోందని, మోటార్లు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. తమ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు 'సాక్షి'తోపాటు ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు

అయోధ్యలో అన్నదానం

- భిక్కనూరు నుంచి సామగ్రితో బయల్దేరిన లారీ

భిక్కనూరు: అయోధ్యలో రామమందిరం వద్ద అన్నదానం కోసం కామారెడ్డి ప్రాంతంలో సేకరించిన బియ్యం, వంటసామగ్రితో లారీ గురువారం బయల్దేరింది. కామారెడ్డి నుంచి అయోధ్యకు ఉచితంగా లారీని పంపుతున్నట్లు మండల కేంద్రానికి చెందిన గౌరిశెట్టి సంతోష్‌కుమార్ తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రం నుంచి శ్రీరామదండు రెండు క్వింటాళ్ల బియ్యం, గౌరిశెట్టి సంతోష్‌కుమార్, శివ రెండు క్వింటాళ్లు, తమ్మళి రమేశ్ క్వింటాల్ బియ్యాన్ని లారీలో అయోధ్యకు పంపించారు. భిక్కనూరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లారీ అయోధ్యకు బయల్దేరింది.


సామగ్రితో అయోధ్యకు బయల్దేరుతున్న లారీ

సమ్మెను జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్ : దేశవ్యాప్తంగా నిర్వహించే నేడు కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ కోరారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింలు, రాజనర్సు పాల్గొన్నారు.

జేఈఈ టాపర్లకు సన్మానం



కామారెడ్డి టౌన్ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన సాందీపని కళాశాల విద్యార్థులను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం గురువారం ఘనంగా సన్మానించారు. పట్టుదలతో చదివి జేఈఈలో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యజమాన్యం జనార్దన్‌రెడ్డి, పెంటయ్య, కృష్ణమూర్తి, అశోక్‌రావు తదితరులున్నారు.

క్లుప్తంగా

షబ్బీర్‌అలీకి సీఎం జన్మదిన శుభాకాంక్షలు



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్‌జయంతి వేడుకల్లో సీఎంతో కలిసి షబ్బీర్ అలీ పాల్గొన్నారు. సీఎంతోపాటు మంత్రులు షబ్బీర్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 89వేల 384 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు.

కలెక్టర్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్: నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వర్తక వాణిజ్య అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌కు సహాయసహకారాలు అందించాలని నూతన కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల లింగం, బొంబోతుల సుకుమార్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా మండలంలోని బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు యువకులు బుధవారం రాత్రి కాల్చేశారు. దీంతో గ్రామంలో వివాదం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు మండల కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించగా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు బస్వాపూర్‌కు చెందిన నలుగురు యువకులను పిలిపించి విచారించారు. ఫ్లెక్సీని కాల్చిన యువకులను శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదన్నారు.

బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపిక



ఎల్లారెడ్డి: మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన అజ్మీరా అనంత్ బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపికై సీఎం చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు తండావాసులు గురువారం తెలిపారు. తండాకు చెందిన గిరిజన యువకుడు కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

'మోడల్' ఉపాధ్యాయుడికి డాక్టరేట్

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది తెలంగాణ మాడల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'సమకాలిన్ హిందీ కహానియోమే గ్రామీణ్ జీవన్ 'అనే అంశంపై హిందీ విభాగం బోర్డ్ ఆఫ్ చైర్ పర్సన్ డాక్టర్ కే సంగీతావ్యాస్ పర్యవేక్షణలో హెచ్‌వోడీ ప్రొఫెసర్ మాయాదేవి చేతుల మీదుగా విజయ్‌కుమార్ పట్టా అందుకున్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీలో చేరి డాక్టరేట్ సాధించారు. ఈమేరకు పాఠశాల ప్రిన్సిపల్ ఫకీరయ్య, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్‌ను అభినందించారు.


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న విజయ్‌కుమార్

బాధ్యతల స్వీకరణ



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి నూతన గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గం గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీడీసీ అధ్యక్షునిగా మద్ది సూర్యకాంత్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా ఏలేటి రమేశ్‌రెడ్డి, చేపూరి రమేశ్, ప్రధానకార్యదర్శిగా నాగార్తి భూంరెడ్డి, కోశాధికారిగా తక్కళ్ల శ్యాంరెడ్డి తదితరులను మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సరెడ్డి సన్మానించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



మాచారెడ్డి : ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ సలహాదారు షబ్బీర్ అలీ బర్త్‌డే సందర్భంగా పాల్వంచ ఇసాయిపేటలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నేతలు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, నాయకులు నర్సింలు తదితరులున్నారు.

శివస్వాములకు అన్నదానం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ సాయిబాబ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం శివస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

బంజారా దేవాలయ కమిటీ ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల బంజారా దేవాలయ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడుగా శివరాంనాయక్, ఉపాధ్యక్షుడు బీర్‌సింగ్, సహాయకార్యదర్శి పూల్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు దేశ్యానాయక్, కోషాధికారి దశరత్‌నాయక్ తదితరులు ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ప్రాజెక్ట్



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : రెడ్డిపేట్ స్కూల్‌తండాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మౌనిక తయారుచేసిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు టీచర్ సుధారాణి పేర్కొన్నారు. విద్యార్థిని కళ్లు లేని వారి కోసం బస్ ఐడెంటిఫికేషన్ అనే డివైస్‌ను తయారు చేసింది. ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడంపై హెచ్‌ఎం వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు భోజన విరామ సమయంలో నిరసన

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలుక కిషన్, నేతికుంట శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (అఖిల భారత ఉద్యోగ సమైఖ్య) పిలుపు మేరకు హక్కుల సాధన కోసం ఉద్యమానికి తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో అన్ని యూనిట్‌శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్: అక్రమంగా తరలిస్తున్న 66 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆర్మూర్ నుంచి ఓ డీసీఎంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం రాత్రి మండలంలోని దాస్‌నగర్ సమీపంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నవాబ్ అనే వ్యక్తి ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని అతడిని అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను పీఎస్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అపోలో మెడికల్ ఎదుట గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం గురువారం లభ్యమైందని ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

టిప్పర్ల పట్టివేత



రెంజల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై విక్రం గురువారం తెలిపారు. మండలంలోని నీలా, పేపర్ మిల్, కందకుర్తి గ్రామాల నుంచి నిజామాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లతో పాటు వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

మావందికూర్దులో..

బోధన్‌రూరల్: మండలంలోని మావందికూర్దు శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొప్పర్గ నుంచి బోధన్ వైపు వస్తుండగా టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. టిప్పర్లను పీఎస్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో హోంగార్డు మృతి చెందాడు. కామారెడ్డిలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే సంజీవ్(44) అనే హోంగార్డు జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. షుగర్‌తో ఇతర అనారోగ్య సమస్యలు పెరిగాయి. బుధవారం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హోంగార్డు మృతికి జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

- ఐదు రోజులకు లభ్యమైన మృతదేహం
- కేసు నమోదు చేసిన పోలీసులు

సదాశివనగర్: తనకు నచ్చిన పని కాకుండా వేరే పని చేయాలంటూ కుటుంబంలో జరుగుతున్న గొడవలకు ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు రాజేశ్వర్(23) అదే గ్రామానికి చెందిన ఈదమ్మతో వివాహం జరిగింది. రాజేశ్వర్ సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెంట్రింగ్ పనులు చేయకుండా వ్యవసాయ పనులు చేయాలని భార్య చెప్పడంతో ఒప్పుకోలేదు. ఈ విషయమై కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లిన రాజేశ్వర్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులో రాజేశ్వర్ మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక మరొకరు..

ఎడపల్లి: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుర్నాపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల మల్లేశ్(35) మూడేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కల్లుబట్టీలో ఘర్షణ

- ఒకరు మృతి, పరారీలో నిందితుడు

నిజామాబాద్‌రూరల్: కల్లుబట్టీలో చోటుచేసుకున్న గొడవలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ గురువారం తెలిపారు. చంద్రశేఖర్ కాలనీకి చెందిన జలీల్‌ఖాన్(35) ఫ్లెక్సీ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. తన మిత్రుడైన భూమేశ్‌తో కలిసి చంద్రశేఖర్ కాలనీలో ఉండే కల్లుబట్టీలో కల్లు సేవిస్తుండగా సోను అనే వ్యక్తితో జలీల్‌ఖాన్ గొడవపడ్డాడు. దీంతో జలీల్‌ఖాన్ అక్కడి నుంచి పారిపోగా అతని వెంటే వెంబడించిన సోను ఓ టిఫిన్ సెంటర్ వద్ద అతన్ని దొరకపట్టి కర్రతో నెత్తిపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రరక్తస్రావమై జలీల్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు పరారీలో ఉన్నాడని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి


రాము మృతదేహం

బాన్సువాడ రూరల్: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మండలంలోని కొల్లూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి రాము(23), లక్ష్మణ్ అనే ఇద్దరు అన్నాతమ్ముళ్లు బుధవారం రాత్రి కొల్లూర్ నుంచి బాన్సువాడకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడ్డారు. ఈ ఘటనలో రాము తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. లక్ష్మణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మరొకరు..


బాల్‌రెడ్డి(ఫైల్)

సదాశివనగర్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కల్వరాల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంట బాల్‌రెడ్డి(50) తన వ్యవసాయ పొలంలో నీరు పారించేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డొంకేశ్వర్‌లో కల్తీ అవుతున్న మద్యం?

వైరల్ అవుతున్న వీడియో

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని లైసెన్సు గల మద్యం దుకాణంలో మద్యం కల్తీ జరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వైన్సు తెరిచి ఉండటాన్ని గమనించిన బయటి వ్యక్తులు వీడియో తీశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో, ఊరి వాట్సాప్ గ్రూపులో వైరల్ అవుతోంది. షటర్ పూర్తిగా మూసేసి అర్ధరాత్రి వరకు లోపల ఎందుకు ఉంటున్నారని వీడియో తీసిన వ్యక్తులు నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో వారు దురుసుగా మాట్లాడిన మాటలు వీడియోలో రికార్డయ్యాయి. మద్యాన్ని కల్తీ చేసి బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్సై రాహుల్‌ని వివరణ కోరగా.. విచారణ చేపడుతున్నామని, అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని 'సాక్షి'కి వివరణ ఇచ్చారు. కానీ ఓ ఎక్సైజ్ అధికారిని సైతం వివరణ కోరితే తన దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.


డొంకేశ్వర్‌లో అర్ధరాత్రి వరకు మద్యాన్ని అమ్ముతున్న సిబ్బంది

రెండు బైక్‌లు చోరీ

బిచ్కుంద: మండల కేంద్రంలోని కూరగాయల సంత, బస్టాండ్ ఎదుట నిలిపిన రెండు బైక్‌లు బుధవారం చోరీకి గురయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఒకే రోజు రెండు బైక్‌లు చోరీకి గురికావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నందిపేట్ మండలంలోని లక్కంపల్లి శివారులో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో రూ. 35,300 నగదు, ఎనిమిది మందిని అరెస్టు చేశారు. దాడిలో సీఐ అజయ్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.